సాక్షి విశాఖపట్నం

సోమవారం । 30 । జూన్ । 2025



వైభవం.. వరదపాయస సేవ 8లో



అట్టహాసం.. మూణ్నాళ్లముచ్చటే.! 8లో



హార్బర్‌లో చేపల జాతర 8లో

న్యూస్‌రీల్

కూర్మావతారంలో జగన్నాథుడు



దాబాగార్డెన్స్: టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథస్వామి కూర్మావతారంలో ఆదివారం దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామికి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 గంటల వరకు నిత్యపూజ, 7 నుంచి 9.30 గంటల వరకు జగన్నాథస్వామి ప్రార్థనా సంఘంచే ప్రార్థనా తరంగిణి, 9.30 నుంచి 10.30 వరకు సామూహిక లలితా సహస్రనామ పారాయణ, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. రథయాత్రలో భాగంగా సోమవారం జగన్నాథ స్వామి వరహావతారంలో భక్తులకు దర్శనమిస్తారని ఈవో తెలిపారు.

విశాఖ అగ్రపీఠాధిపతికి పాల్లియం ప్రదానం



విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుముల బాలకు పాల్లియం ప్రదానం చేస్తున్న 14వ లియో పోప్

దాబాగార్డెన్స్: సెయింట్ పీటర్, సెయింట్ పాల్ మహోత్సవ దివ్య బలి పూజ సందర్భంగా సెయింట్ పీటర్ బసిలికాలో ప్రపంచవ్యాప్తంగా కొత్తగా నియమితులైన 54 మంది మెట్రోపాలిటన్ ఆర్చ్ బిషప్‌లకు 14వ లియో పోప్ పాల్లియంను దీవించి అందజేశారు. ఈ మహోత్సవంలో భారతదేశం నుంచి ముగ్గురు అగ్రపీఠాధిపతులకు ఈ గౌరవం లభించింది. వారిలో విశాఖపట్నం అగ్రపీఠాధిపతిగా పాలనా బాధ్యతలు నిర్వహిస్తున్న ఉడుముల బాల కూడా ఉన్నారు. కాగా.. పాల్లియం అనేది తెల్లని గొర్రె ఉన్నితో తయారు చేసిన దైవార్చన వస్త్రం. ఇది మెట్రోపాలిటన్ ఆర్చ్ బిషప్‌కు అధికారిక చిహ్నంగా పరిగణిస్తారు. స్థానిక అగ్రపీఠ పరిధిలోని ఇతర మేత్రాసనములతో పోప్‌కు ఉండే సమైక్యతను ఇది ప్రతిబింబిస్తుంది. ఉడుముల బాల విశాఖపట్నం అగ్రపీఠాధిపతిగా నియమితులై ఈ గొప్ప గౌరవాన్ని పొందడం అగ్రపీఠానికే కాకుండా, యావత్ భారతదేశానికి గర్వకారణమని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

మహారాణిపేట : కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

తీరానికి కొట్టుకొచ్చిన తిమింగలం కళేబరం



కొమ్మాది: భీమిలి తీరానికి ఆదివారం సాయంత్రం భారీ తిమింగలం కళేబరం కొట్టుకొచ్చింది. తిమింగలం గాయాలతో ఉందని, వలలకు చిక్కుకుని లేక పడవ తగిలి మృతి చెంది ఉంటుందని మత్స్యకారులు తెలిపారు.

విలాసాల నౌక వచ్చేస్తోంది!



నేడు చెన్నైలో బయలుదేరి 2వ తేదీన విశాఖ చేరుకోనున్న నౌక

మళ్లీ సముద్రంలో సందడే సందడి

- వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభమైన కార్డేలియా క్రూయిజ్ యాత్ర
- విశాఖ నుంచి జూలై 2, 9, 16 తేదీల్లో ప్రారంభం
- చెన్నై–విశాఖపట్నం–పుదుచ్చేరి–చెన్నై మధ్య సర్వీసు
- ఇప్పటికే ఆన్‌లైన్‌లో ప్రారంభమైన టికెట్ల విక్రయాలు

విశాఖ సిటీ : సాగర విహార ప్రపంచానికి విశాఖ మరోసారి స్వాగతం పలుకుతోంది. సముద్ర జలాల్లో తేలియాడే అద్భుత సౌధం మళ్లీ నగరానికి వచ్చేస్తోంది. అలలపై ఆహ్లాదకర ప్రయాణాన్ని అందించనుంది. విలాసవంతమైన సముద్ర విహార నౌకను చెన్నై–విశాఖపట్నం–పుదుచ్చేరి–చెన్నైల మధ్య నడపడానికి కార్డేలియా క్రూయిజ్ సంస్థ మళ్లీ ముందుకొచ్చింది. విశాఖ నుంచి జూలై 2, 9, 16 తేదీల్లో మూడు ట్రిప్పులు నడపనున్నట్లు ప్రకటించింది. 2022 జూన్‌లో ఇదే సంస్థ విశాఖ నుంచి క్రూయిజ్ నౌకను నడిపింది. ఈ నౌకలో విహరించేందుకు విశాఖ ప్రజలే కాకుండా చుట్టు పక్కల రాష్ట్రాల పర్యాటకులు పోటీ పడ్డారు. దీంతో 85 శాతం మేర ఆక్యుపెన్సీతో ఆ ఏడాది సెప్టెంబర్ వరకు నడిచింది. ఈసారి విశాఖ పోర్టులో కొత్తగా నిర్మించిన ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్ నుంచి ఈ విహార నౌక రాకపోకలు సాగించనుంది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయాలను సైతం ప్రారంభించింది.

విహార యాత్ర ఆరంభం ఇలా..

సెవెన్ స్టార్ హోటల్‌కు మించి విలాసవంతమైన నౌకలో విహారం.. బయట ప్రపంచంతో సంబంధం లేకుండా 24 గంటలు వినోదం.. విభిన్న వంటకాలతో రుచికరమైన ఆహారం.. ఆరోగ్యానికి జిమ్, ఫిట్‌నెస్ సెంటర్ల సౌకర్యం.. స్విమ్మింగ్ పూల్స్‌లో జలకాలాటలు.. రాక్ క్లైంబింగ్ విన్యాసాలు.. ఆహ్లాదపరిచే డ్యాన్స్ షోలు.. అబ్బురపరిచే మ్యాజిక్ ప్రదర్శనలు.. సినిమా థియేటర్లు.. ఇలా ఎటువంటి ఒత్తిడి లేకుండా.. సమయం తెలియకుండా 24/7 ఎంజాయ్ చేసే లగ్జరీ విహార యాత్ర విశాఖ నుంచి ప్రారంభమవుతోంది. ఈ క్రూయిజ్ నౌక జూన్ 30న చెన్నైలో బయలుదేరి జూలై 2వ తేదీ ఉదయం విశాఖకు వస్తుంది. అదే రోజు సాయంత్రం ఇక్కడ నుంచి బయలుదేరి 4వ తేదీన పుదుచ్చేరికి చేరుకుంటుంది. మళ్లీ అదే రోజు అక్కడి నుంచి బయలుదేరి 5వ తేదీన చెన్నై వెళుతుంది. దీంతో ఒక ట్రిప్పు పూర్తవుతుంది. ఆ తరువాత జూలై 7న చెన్నైలో మరో ట్రిప్పు ప్రారంభమై.. 9వ తేదీన విశాఖకు చేరుకుని.. మళ్లీ ఇక్కడి నుంచి బయలుదేరి 12వ తేదీన చెన్నైలో ముగుస్తుంది. మూడో ట్రిప్పు జూలై 14న చెన్నైలో మొదలై 16వ తేదీకి విశాఖకు చేరుకుంది. తిరిగి అదే రోజు ఇక్కడి నుంచి ప్రారంభమై 19వ తేదీన చెన్నైలో ముగుస్తుంది.



క్రూయిజ్‌లో సదుపాయాలు

- కార్డేలియా ఎంప్రెస్ క్రూయిజ్ నౌక ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంది.
- మొత్తం 11 అంతస్తులతో ఉండే ఈ క్రూయిజ్ మొదటి ఫ్లోర్‌లో ఇంజిన్, రెండో ఫ్లోర్‌లో కార్గో ఉంటుంది.
- మూడో ఫ్లోర్ నుంచి పాసింజర్ లాంజ్ మొదలవుతుంది.
- అక్కడి నుంచి ఎలివేటర్ ద్వారా పదో అంతస్తు వరకు చేరుకోవచ్చు.
- పదో ఫ్లోర్‌లో డెక్ లాంటి పెద్ద టెరస్ ఉంటుంది.
- 11వ అంతస్తులో ఉండే ప్రత్యేక సెటప్ ద్వారా సూర్యోదయం, సూర్యాస్తమయాలను వీక్షించడం మధురానుభూతిని కలిగిస్తుంది.
- లగ్జరీ సూట్(8వ ఫ్లోర్) మినహా మిగిలిన అన్ని రకాల రూమ్స్ దాదాపుగా అన్ని ఫ్లోర్లలో ఉంటాయి.
- ఫుడ్‌కోర్టులు, మూడు స్పెషాలిటీ రెస్టారెంట్లు, 5 బార్లు, స్పా, సెలూన్ అందుబాటులో ఉన్నాయి.
- చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఫన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేకంగా ఈ నౌకలో కార్డేలియా కిడ్స్ అకాడమీ పేరుతో విశాల ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు.





- జిమ్, ఫిట్‌నెస్ సెంటర్, స్విమ్మింగ్ పూల్, కేసినో, డ్యాన్సులు, కామెడీ, మ్యాజిక్ షోల కోసం ఆడిటోరియం, కొత్త సినిమాలను వీక్షించడానికి థియేటర్, నైట్ క్లబ్, 24 గంటల సూపర్ మార్కెట్, లైబ్రరీ ఇలా క్షణం కూడా బోర్ కొట్టకుండా అనేక సదుపాయాలు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.
- డీజే ఎంటర్‌టైన్‌మెంట్, లైవ్ బ్యాండ్‌ను ఎంజాయ్ చేయవచ్చు.
- అడ్వెంచర్ యాక్టివిటీస్, షాపింగ్‌మాల్స్, లైవ్ షోలు కూడా అలరిస్తాయి.
- టికెట్ తీసుకున్న ప్రతీ ఒక్కరికీ క్యాసినోలో ఎంట్రీ ఉచితం.
- లిక్కర్, ఇతర సర్వీసులకు అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

క్యాసినో ఆడాలంటే..

రాష్ట్రంలో క్యాసినో ఆడేందుకు ప్రభుత్వం అనుమతి లేదు. ఇందుకు కొంత సమయం వేచి ఉండాల్సిందే. నౌక ప్రయాణం ప్రారంభమై 20 మైళ్లు వెళ్లిన తరువాత క్యాసినో ఆడేందుకు అవకాశం ఉంటుంది.

గత ప్రభుత్వ చొరవతో విశాఖకు క్రూయిజ్

విశాఖలో క్రూయిజ్ రాక దీర్ఘకాల కలగా ఉండేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. విలాసవంతమైన క్రూయిజ్ నౌక ప్రయాణం విశాఖలో అందుబాటులో ఉంటే.. ఇక్కడకు పర్యాటకుల తాకిడి మరింత పెరుగుతుందని భావించింది. ఇందుకోసం కార్డేలియా సంస్థతో సంప్రదింపులు జరిపింది. వాస్తవానికి కార్డేలియా క్రూయిజ్ సర్వీసు విశాఖకు లేదు. ముంబయి, చెన్నై, గోవా, అండమాన్, లక్షద్వీప్ వంటి ప్రాంతాల్లో ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటక శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో విశాఖ నుంచి సర్వీసు నడిపేందుకు అంగీకరించింది. అది కూడా ముందుగా మూడు సర్వీసులు నడిపి డిమాండ్‌ను బట్టి నిర్ణయం తీసుకోవాలని భావించింది. కానీ విశాఖవాసులే కాకుండా పశ్చిమబెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు విశాఖ నుంచి క్రూయిజ్ విహార యాత్రకు పోటీ పడ్డారు. దీంతో ఆ సర్వీసును సెప్టెంబర్ వరకు పొడిగించింది.

ఆటస్థలం పేరుతో ఆక్రమణ?





దిబ్బడిపాలెం సర్వే నంబర్ 258లో రెండు ఎకరాలకు పైగా చదును చేసిన కొండవాలు ప్రాంతం (ఇన్‌సెట్) నెలరోజుల కిందట ఇదే స్థలంలో హెచ్చరిక బోర్డు పెట్టిన గిడిజాల వీఆర్వో నవీన్

రూ.25 కోట్ల విలువైన భూమి కబ్జాకు యత్నం

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీలోని దిబ్బడిపాలెం సర్వే నంబర్ 258లో పెద్ద కొండను ఆనుకుని ఉన్న సుమారు 2 ఎకరాలకు పైగా స్థలం ఆటస్థలం పేరుతో కబ్జా చేసేందుకు స్కెచ్ రెడీ అయింది. దీని విలువ రూ.25 కోట్ల పైమాటే. ఈ ప్రాంత యువకుల క్రీడా అవసరాల పేరుతో కబ్జాల్లో ఘనుడైన కూటమి ప్రభుత్వానికి చెందిన ఒక వ్యక్తి దీని వెనుక ఉన్నట్టు టీడీపీ నాయకులే బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికే ఈ కొండ భాగాన్ని తవ్వి వేలాది లారీల గ్రావెల్‌ను తరలించి లక్షల రూపాయలు వెనకేసుకున్నాడు. గతంలో కూడా పంచాయతీలో సర్వే నంబర్ 310/5లో 2 ఎకరాలు, 311/14లో 2.04 ఎకరాలు కలిపి రూ.40 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసి రిసార్ట్స్ పేరుతో నడుపుతున్న సంగతి తెలిసిందే. దీనిపై రెండు నెలల కిందట ఆనందపురం మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంతో.. మరో విలువైన స్థలాన్ని ఆక్రమించేందుకు జోరుగా పావులు కదుపుతున్నాడు. దీనిపై ఎవరూ నోరు మెదపకుండా ఇప్పటి నుంచే నోట్ల కట్టలతో ప్రభావితం చేస్తున్నాడు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రిని తీసుకువచ్చి రాజమార్గం ద్వారా ఈ స్థలాన్ని కొట్టేసే ప్రయత్నాలు జరుగుతున్నట్టు టీడీపీ నాయకులే చెబుతున్నారు.

గతంలో ఈ స్థలం పీహెచ్‌సీకి కేటాయింపు

2014–19 టీడీపీ హయాంలో ఈ స్థలాన్ని అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) కేటాయించారు. నెలరోజుల కిందట ఎమ్మెల్యే గంటా వద్దకు కబ్జాల్లో ఆరితేరిన ఈ వ్యక్తి 50 మంది స్థానిక యువకులను తీసుకువెళ్లి చదును చేసిన 2 ఎకరాల స్థలాన్ని ఆటస్థలానికి ఇవ్వాలని కోరగా ఆయన నిరాకరించారు. మండలంలో టీడీపీ నాయకులంతా నిన్ను వ్యతిరేకిస్తున్నారని ముఖం మీదే కుండబద్దలు కొట్టడంతో ఆ వ్యక్తి విసురుగా వెళ్లిపోయాడు. ఇప్పుడు ఆనందపురం తహసీల్దార్ లేకపోవడంతో ఇదే అదనుగా మళ్లీ ఈ స్థలంలో పాగా వేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఇక్కడి రిసార్ట్‌లో పేకాట క్లబ్ నిర్వహించకుండా ఆనందపురం పోలీసులు గట్టిగా కాపలా కాశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అదే పోలీసులు ఈ కబ్జా రాయుడితో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నారు. సీపీ శంఖబ్రత బాగ్చి బదిలీపై వెళ్లిపోయిన తర్వాత కొత్తగా వచ్చిన అధికారితో మాట్లాడుకుని తిరిగి పేకాట క్లబ్ నిర్వహించాలని ప్రణాళిక రచిస్తున్నాడు. ప్రస్తుతం తహసీల్దార్ లేనందున ఇదే అదనుగా 2 ఎకరాల స్థలాన్ని క్రీడా మైదానం పేరుతో చేజిక్కించుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

ఉపాధ్యాయులకు సర్దు‘పోటు’

- పెరిగిన విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తి
- మిగిలిన స్కూల్ అసిస్టెంట్ పోస్టులు
- ప్రాథమిక పాఠశాలలకు సర్దుబాటు
- మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల చేరికలు

ఆరిలోవ : జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల ఉపాధ్యాయ పోస్టులకు భారీగా కోత పడింది. కూటమి ప్రభుత్వం విద్యా విధానంలో చేపట్టిన మార్పులు, ముఖ్యంగా విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తిని మార్చడంతో విద్యాబోధనకు, విద్యార్థుల భవిష్యత్తుకు తీవ్రంగా నష్టం కలిగిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిష్పత్తి పెంపుతో పోస్టులకు కోత

ఇటీవల ప్రభుత్వం విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తిని 40:1 నుంచి 49:1కి పెంచింది. అంటే ఒక తరగతి గదిలో విద్యార్థుల సంఖ్యను 40 నుంచి 49కి పెంచారు. ఈ నిర్ణయం వల్ల ఉన్నత పాఠశాలల్లో అవసరమైన స్కూల్ అసిస్టెంట్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీనికి తోడు ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు మందకొడిగా ఉన్నాయి. ఒక వైపు విద్యార్థుల సంఖ్య తగ్గుతుండగా, మరోవైపు నిష్పత్తిని పెంచడంతో ఉపాధ్యాయ పోస్టులు మిగులుగా(సర్ ప్లస్) తేలాయి. ఈ పరిణామాలు డీఎస్సీ–2025లో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఉపాధ్యాయ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇదే పరిస్థితి ప్రాథమిక పాఠశాలల్లోనూ నెలకొంది. అక్కడ కూడా విద్యార్థుల సంఖ్య తగ్గడం, నిష్పత్తి పెరగడంతో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల(ఎస్జీటీ) పోస్టుల అవసరం కూడా గతంతో పోలిస్తే తగ్గిపోయింది.



తోటగరువు హైస్కూల్‌లో బోధిస్తున్న స్కూల్ అసిస్టెంట్

వందకు పైగా పోస్టులు మిగులు

విశాఖ జిల్లా పరిధిలోని ఏడు మండలాల్లో 56 ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల కౌన్సెలింగ్‌లో కొత్త నిష్పత్తి కారణంగా సుమారు 100కి పైగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మిగులుగా తేలాయి. ఈ మిగులు ఉపాధ్యాయులను ఏ ఖాళీల్లో సర్దుబాటు చేయాలో తెలియక జిల్లా విద్యాశాఖాధికారులకు కత్తిమీద సాములా మారింది. చివరికి ఉన్నత పాఠశాలల్లో మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్లను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా నియమించాల్సి వచ్చింది. దీని వల్ల ఇప్పటివరకు 6 నుంచి 10వ తరగతి వరకు ప్రత్యేక సబ్జెక్టులు బోధించిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు.. ఇప్పుడు 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు అక్షరాలు నేర్పించాల్సిన విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది.

ప్రధాన స్కూళ్లలో తగ్గిన స్కూల్ అసిస్టెంట్లు

- రాష్ట్రంలోనే అతి పెద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా పేరుగాంచిన మధురవాడలోని చంద్రంపాలెం పాఠశాలలో గతంలో 110 మంది స్కూల్ అసిస్టెంట్లు ఉండగా, ఇప్పుడు వారి సంఖ్య 92కి పడిపోయింది. 2024–25లో 3,400 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది 2,700కి తగ్గింది. ప్రస్తుతం ప్రవేశాలు జరుగుతున్నా.. ఆశించిన స్థాయిలో విద్యార్థులు చేరడం లేదు. తగ్గిన విద్యార్థుల సంఖ్యకు తోడు, కొత్త నిష్పత్తిని వర్తింపజేయడంతో అధికారులు ఇక్కడ నుంచి 18 మంది స్కూల్ అసిస్టెంట్లను బదిలీ చేశారు.
- జిల్లాలో రెండో అతిపెద్ద పాఠశాలైన తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలదీ ఇదే పరిస్థితి. గతంలో 60(1 ప్లస్59) మంది స్కూల్ అసిస్టెంట్లు ఉండేవారు. ఇద్దరు మరణించడం, నలుగురు పదవీ విరమణ చేయడంతో 54 మంది మిగిలారు. కొత్త నిష్పత్తి ప్రకారం ఇటీవల జరిగిన బదిలీల్లో మరో 7 పోస్టులు రద్దయ్యాయి. దీంతో ఇక్కడ మొత్తం 13 పోస్టులు తగ్గి, ప్రస్తుతం 47 మంది స్కూల్ అసిస్టెంట్లు మాత్రమే ఉన్నారు. గత ఏడాది 1,414 మంది విద్యార్థులు ఉండగా, కొత్త చేరికలతో కలిపి ప్రస్తుతం వారి సంఖ్య 1,265కి తగ్గింది.

ప్రాథమిక పాఠశాలలపైనా ప్రభావం

చినగదిలి మండలం తోటగరువు ప్రాథమిక పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులకుగాను ఇద్దరిని తగ్గించి, ఐదుగురిని మాత్రమే కొనసాగిస్తున్నారు. సంతపాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి బదిలీతో ఏర్పడిన ఖాళీలో ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌ను ప్రధానోపాధ్యాయురాలిగా నియమించారు. ఆమె ఇప్పుడు ఐదో తరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సి వస్తోంది. విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తి పెంపు నిర్ణయం జిల్లాలోని అనేక పాఠశాలల్లో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పడిగాపులు

- సాయంత్రం వరకు ప్రారంభంకాని బదిలీల కౌన్సెలింగ్
- భారీగా సిఫార్సు లేఖలు.. ఫైరవీలకే పెద్దపీట



బదిలీల కోసం వచ్చిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

మహారాణిపేట : బదిలీల కౌన్సెలింగ్ కోసం ఆదివారం ఉదయాన్నే జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకున్న సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సాయంత్రం వరకు పడిగాపులు పడ్డారు. తిండి తిప్పలు లేకుండా జిల్లా పరిషత్ ఆవరణలో గట్లు మీద, ఖాళీ ప్రాంతాల్లో నిరీక్షించారు. కౌన్సెలింగ్‌కు ఎప్పుడు పిలుస్తారా అని ఎదురుచూశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 442 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు. ఇందులో 95 శాతం మంది ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారు ఉన్నారు. పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులు ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉదయాన్నే కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకోగా సాయంత్రం వరకు పిలవలేదు. అసలు ఏమి జరుగుతుందో తెలియక ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఆందోళన చెందారు. కూటమి ప్రజాప్రతినిధులు సిఫార్సు లేఖలు పెద్ద సంఖ్యలో రావడంతో పంచాయతీరాజ్ ఎస్ఈ కె.శ్రీనివాసరావు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు తర్జనభర్జన పడినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు అడిగిన పోస్టింగ్‌లు, ఇతర వ్యవహారాల వల్ల కౌన్సెలింగ్ జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. ఖాళీల జాబితా చివరి నిమిషం వరకు బయట పెట్టకపోవడంపై ఆందోళన వ్యక్తమైంది. కాగా సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ రాత్రి వరకు కొనసాగింది. తొలుత దివ్యాంగులు, స్పౌజ్, అనారోగ్య పీడితులకు కౌన్సెలింగ్ చేపట్టారు. ఆ తర్వాత కూటమి ప్రజాప్రతినిధుల సిఫార్సుల మేరకు బదిలీలు నిర్వహించారన్న ఆరోపణలు వచ్చాయి.



చంటి బిడ్డలతో తల్లుల నిరీక్షణ

కార్యదర్శుల కౌన్సెలింగ్‌లో గందరగోళం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన వార్డు సంక్షేమ కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ గందరగోళంగా మారింది. జీవీఎంసీ పరిధిలో 473 మంది కార్యదర్శులున్నారు. ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్నవారిని బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా యూసీడీ పథకం సంచాలకులు పి.ఎం.సత్యవేణి ఆధ్వర్యంలో కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్ ఆదివారం నిర్వహించారు. ప్రతి కార్యదర్శి మూడు ఆప్షన్లు ఇస్తే.. అందులో ఒకటి ఎంపిక చేసి పోస్టింగ్ ఇస్తామని అధికారులు తెలిపారు. ఒకే ఆప్షన్ ఇస్తే కౌన్సెలింగ్ ప్రక్రియ సులభతరమవుతుందని కార్యదర్శులు అడగడంతో అధికారులు ససేమిరా అన్నారు. కార్యదర్శులు పట్టువిడవలేదు. దీంతో అధికారులు, కార్యదర్శుల మధ్య గందరగోళం నెలకొంది. ఎమ్మెల్యేలు, మంత్రులు సిఫార్సు లేఖలు తీసుకువచ్చిన వారికి అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారని కార్యదర్శులు ఆరోపిస్తున్నారు.

సర్వేయర్ల ఆందోళన

బదిలీల్లో సిఫార్సులకు పెద్దపీట వేశారని ఆవేదన

మహారాణిపేట : సచివాలయ సర్వేయర్లు గ్రేడ్–2 బదిలీల్లోనూ కూటమి ఎమ్మెల్యేల సిఫార్సులకు పెద్దపీట వేశారంటూ సర్వేయర్లు ఆందోళనకు దిగారు. ఆదివారం కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సర్వే డిపార్టుమెంటులో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి ఆదివారం బదిలీ కౌన్సెలింగ్ చేపట్టారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 354 మంది బదిలీ కౌన్సెలింగ్ కోసం వచ్చారు. సర్వే అసిస్టెంట్ డైరెక్టర్లు సూర్యారావు(విశాఖ), గోపాలరావు(అనకాపల్లి) బదిలీ కౌన్సెలింగ్ చేపట్టారు. బదిలీల్లో ఫైరవీలకు పెద్ద పీట వేస్తున్నారని, సిఫార్సుల వల్ల తాము నష్టపోతున్నామని, జాబితా ప్రకారం బదిలీలు చేయడం లేదని సర్వేయర్లు ఆందోళనకు దిగారు. కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల వల్ల నిజాయితీపరులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.



కలెక్టరేట్ ఆవరణలో ఉన్న సర్వే డిపార్టుమెంట్ వద్ద వేచి ఉన్న సర్వేయర్లు

వైభవం.. వరదపాయస సేవ


పొర్లుబండపై నుంచి పాయసాన్ని జారవిడుస్తున్న అర్చకులు

- వైకుంఠవాసుడికి విశేషంగా అభిషేకాలు
- విరాట్‌పర్వ పారాయణం, పాయసం నివేదన

సింహాచలం: సింహగిరిపై వైకుంఠవాసుడి సన్నిధిలో ఆదివారం వరదపాయసం సేవ విశేషంగా నిర్వహించారు. దేశంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఏటా సింహగిరిపై ఉన్న వైకుంఠవాసుడి మెట్టపై కొలువుదీరిన వైకుతవాసుడి సన్నిధిలో పాయసం వండి, సమీపంలో ఉన్న పొర్లు బండపై నుంచి జారవిడవడం ఆచారంగా వస్తోంది. దీనినే వరదపాయసం సేవగా పేర్కొంటారు. అప్పన్న ఆలయ అర్చకులు ఉదయం 8 నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడై కొలువు దీరిన వైకుంఠవాసుడి సన్నిధిలో విష్వక్సేణపూజ, పుణ్యాహవచనం, పంచకలశ ఆవాహనం, పంచకలశ స్నపనం, విశేష ఆరాధన ఘనంగా జరిపారు. విరాట్‌పర్వ పారాయణం చేశారు. అనంతరం అక్కడే వండిన పాయసాన్ని స్వామికి నివేదించి, సమీపంలో ఉన్న పొర్లు బండపై జారవిడిచారు. భక్తులు పొర్లు బండపై నుంచి జారే పాయసాన్ని ప్రసాదంగా స్వీకరించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకుడు కరి సీతా రామాచార్యులు, అర్చకులు, పారాయణదారులు, వేదపండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసం..మూణ్నాళ్ల ముచ్చటే.!

- దుర్వినియోగమైన ప్రజాధనం
- బయటపడ్డ నాణ్యత డొల్లతనం
- బీచ్‌రోడ్డులో మొక్కుబడిగా సాగిన 'యోగాంధ్ర' పనులు

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన 'యోగాంధ్ర' పనులు మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలాయి. ప్రజాధనంతో చేపట్టిన సుందరీకరణ పనుల్లోని నాణ్యతలోపాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో మొక్కుబడిగా పనులు చేసి కాంట్రాక్టర్లు చేతులు దులుపుకోగా.. ప్రజాధనం నీళ్లపాలైన తీరు నగరవాసులను విస్మయానికి గురి చేస్తోంది.

బట్టబయలైన నాణ్యత లోపం

నెల రోజుల పాటు హడావుడి చేసి.. బీచ్ రోడ్డుకు వేసిన రంగులు కేవలం వారం రోజుల్లోనే వెలిసిపోవడం పనుల నాణ్యతకు అద్దం పడుతోంది. ప్రధానమంత్రి పాల్గొన్న ఆర్.కె.బీచ్ వేదిక వద్ద నుంచి వీఎంఆర్డీఏ స్మార్ట్ సిటీ పార్క్ వరకు ఫుట్‌పాత్‌లకు వేసిన తెలుపు, నలుపు రంగులు పూర్తిగా వెలిసిపోతున్నాయి. కోట్ల రూపాయల ప్రజాధనంతో చేపట్టిన పనులు కనీసం నెల రోజులైనా నిలవకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. పనులు జరుగుతున్నప్పుడే నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ 'సాక్షి' పలు కథనాలు ప్రచురించింది. అయినప్పటికీ అధికారులు ఒత్తిడిలో వాటిని పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్లు నాసిరకం పనులతో సరిపెట్టారు. కార్యక్రమం జరిగి వారం రోజులకే రంగులు వెలిసిపోవడం, ప్రజాధనం ఎలా దుర్వినియోగమైందో చెప్పడానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.


యోగా విలేజ్ వద్ద ఎండిన మొక్కలు


సీ హారియర్ వద్ద మొక్కల దుస్థితి


ఏయూ కన్వెన్షన్ వద్ద జీవం కోల్పోయిన మొక్కలు


కాళీమాత ఆలయం ఎదుట వెలిసిపోయిన ఫుట్‌పాత్

మొక్కల సంరక్షణ ఎక్కడ?

రంగుల విషయంలోనే కాక మొక్కల పెంపకంలోనూ ఇదే నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. యోగా విలేజ్, జీవీఎంసీ స్విమ్మింగ్ పూల్, ఏయూ కన్వెన్షన్ సెంటర్ వంటి కీలక ప్రాంతాల్లో నాటిన మొక్కలు నీళ్లు లేక ఎండిపోయి చనిపోతున్నాయి. పాండురంగాపురం వద్ద ఏర్పాటు చేసిన వర్టికల్ గార్డెన్‌లోని మొక్కల్లో చాలా వరకు జీవం కోల్పోయాయి. కొన్ని మొక్కలను కనీసం మట్టిలో నాటకుండా కుండీలతో సహా వదిలేయడం గమనార్హం.

ప్రజాధనం దుర్వినియోగంపై ప్రజల ఆగ్రహం

ప్రతిష్టాత్మక కార్యక్రమం పేరుతో కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని నగరవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత తక్కువ కాలంలోనే పనులు పాడైపోతుంటే, ఆ కాంట్రాక్టర్లకు బిల్లులు ఎలా చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జరిగిన పనుల నాణ్యతపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించాలని, బాధ్యులైన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని, బిల్లుల చెల్లింపును నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే, ప్రజాధనాన్ని దోచుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు ఒక మార్గంగా మారిపోతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వీఆర్‌ఎస్‌పై అయోమయం

- ముందుకురాని స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు
- ఇప్పటివరకు కేవలం 850 దరఖాస్తులు



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం రెండో విడత ప్రకటించిన వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్‌ఎస్) దరఖాస్తు విషయంలో ఉద్యోగుల్లో అయోమయం నెలకొంది. మూడో బ్లాస్ట్‌ఫర్నేస్ ప్రారంభించినందున ప్లాంట్ పరిస్థితులు బాగుపడే అవకాశం ఉందని ఉద్యోగులు ఒకవైపు ఆశావాహంగా ఆలోచిస్తుండగా.. రానున్న రోజుల్లో మరింత పని ఒత్తిడి పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటుందన్న భయం మరోవైపు వెంటాడుతోంది. ఈ పరిస్థితుల్లో ఈ వీఆర్‌ఎస్ పట్ల ఉద్యోగులు ఆచీతూచి వ్యవహరిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, ఆర్థిక సదుపాయాల కోత వంటి కారణాల వల్ల ఈ ఏడాది మార్చి నెలలో వచ్చిన మొదటి వీఆర్‌ఎస్‌కు స్పందన లభించింది. అప్పట్లో కూడా వీఆర్‌ఎస్ పరిహారం, పీఎఫ్, గ్రాట్యుటీ, లీవ్ శాలరీ మొత్తం ఇస్తారా... లేదా అనే సందేహాలతో 1,613 మంది మాత్రమే దరఖాస్తు చేస్తున్నారు. యాజమాన్యం వారికి సకాలంలో అన్ని చెల్లించడంతో అప్పుడు దరఖాస్తు చేయనివారు తప్పు చేశామన్న భావన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఇటీవల కాలంలో పెరిగిన పని ఒత్తిడి, పూర్తి జీతాలు ఇప్పటికీ చెల్లించకపోవడం వంటి కారణాల వల్ల ఈసారి వీఆర్‌ఎస్ వస్తే కనీసం మూడు వేల మంది దరఖాస్తు చేస్తారని అందరూ ఊహించారు. అయితే అంత స్పందన లేకపోవడం పట్ల అందరూ ఆశ్చర్యపోతున్నారు. గత బడ్జెట్‌లో మిగిలిన సొమ్ము మేరకు మాత్రమే ఈసారి వీఆర్‌ఎస్ ఇస్తారని తద్వారా 500 మందికి మించరని ఊహాగానాలు వినిపించడం, ఇప్పటికే సిబ్బంది బాగా తగ్గిన నేపథ్యంలో చాలా విభాగాల్లో విభాగాధిపతులు వచ్చిన దరఖాస్తులను అంగీకరించేది లేదని చెబుతుండటంతో చాలా మంది ఆశావాహులు ఢీలా పడి దరఖాస్తు చేయనట్టు తెలుస్తుంది. అందువల్లే ఇప్పటివరకు సుమారు 850 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని తెలుస్తుంది. జూలై 15 వరకు గడువు ఉన్నందున చివరలో ఎక్కువ దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని మరో వాదన వినిపిస్తున్నది. ఏమైనా గడువు ముగిస్తే కాని వీఆర్‌ఎస్‌పై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

రైలు నుంచి జారిపడిన యువకులు

- ఒకరికి గాయాలు


108లో కేజీహెచ్‌కు యువకుడి తరలింపు

గోపాలపట్నం: ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ నుంచి ఇద్దరు యువకులు జారిపడగా, వారిలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సింహాచలం రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో పవిత్రా దాస్, సగ్రామ్ దాస్ ప్రయాణిస్తున్నారు. సింహాచలం రైల్వేస్టేషన్‌లో ఈ రైలుకు హాల్ట్ లేదు. అయితే రైలు స్టేషన్‌లో నెమ్మదిగా వెళ్తున్న సమయంలో వారు ప్రమాదవశాత్తు కిందపడిపోయారు. అక్కడే ఉన్న ఆర్పీఎఫ్ సిబ్బంది గమనించి వారిని కాపాడారు. వారిలో ఒకరికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. ఈ యువకులు ఒడిశా రాష్ట్రం డెంకనాల్ జిల్లా కుకట గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. బెంగళూరు వెళ్తున్న వీరు ఫుట్‌బోర్డుపై కూర్చోవడం వల్ల కళ్లు తిరిగి పడిపోయి ఉంటారని పోలీసులు అంచనా వేస్తున్నారు. అదృష్టవశాత్తు ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై పడటం వల్ల ప్రాణాపాయం తప్పిందని ఆర్పీఎఫ్ ఎస్ఐ సూరజ్ కుమార్, ఏఎస్ఐ జి.శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ డి.జగదీష్ తెలిపారు.

ఆకట్టుకున్న చతుర్గుణిత అష్టావధానం


అష్టావధానంలో పాల్గొన్న అవధాని డాక్టర్ బులుసు అపర్ణ, పృచ్ఛకులు

మద్దిలపాలెం: చతుర్గుణిత అష్టావధానం ప్రక్రియ డాక్టర్ బులుసు అపర్ణ ఆధ్వర్యంలో సాహిత్య శ్రావ్యనందకరంగా జరిగింది. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షుడు పేరాల బాలకృష్ణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అత్యద్భుతంగా సాగింది. నిషిద్ధాక్షరి, సమస్య దత్తపది, వర్ణన, ఆశువు, వ్యస్తాక్షరి, న్యస్తాక్షరి, వారగణనం, అనువాదం, పురాణం అనే అంశాలపై 32 మంది పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు డాక్టర్ బులుసు అపర్ణ అసాధారణ రీతిలో.. ఏకధాటిగా పద్యరూపంలో పూరణ చేసి సభికులను రంజింపజేశారు. దీంతో సభికులు తమ కరతాళ ధ్వనులతో అభినందనలు తెలుపగా కళాభారతి మార్మోగిపోయింది. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్మాలూరి రాంబాబు, శ్రీ విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షుడు పేరాల బాలకృష్ణ, కార్యదర్శి పేరాల సీతారాం ప్రభుతో కలిసి ముఖ్య అతిథి మధుర కవి డాక్టర్ బులుసు వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలనతో అవధాన ప్రక్రియను ప్రారంభించారు. ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ పేరి రవికుమార్ ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, డాక్టర్ దాడి వీరభద్రరావు, ఆచార్య రామవరపు శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు


మాట్లాడుతున్న మోహనరావు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు అన్నారు. జిల్లా యూటీఎఫ్ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం ఎన్జీఏలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జీవో 19 ద్వారా 9 రకాల పాఠశాలలు ఏర్పాటు చేశారని తెలిపారు. దీని వల్ల కొన్ని పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 9,652 మోడల్ ప్రాథమిక పాఠశాలలు, 1,552 ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసిన 779 ఉన్నత పాఠశాలలు, 5 వేల ఫౌండేషన్ పాఠశాలలు, 19 వేల బేసిక్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారే ప్రమాదం ఉందని, వీటిని బలమైన పాఠశాలలుగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలల పనివేళల్లో బోధనేతర పనులు, శిక్షణ తరగతులు లేకుండా చూడాలని కోరారు. అదే విధంగా ఆర్థిక బకాయిలు చెల్లించాలని, పీఆర్సీ కమిషన్ నియమించి, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు జూలై 5వ తేదీ వరకు డ్రైవ్ చేపట్టాలని, ఇందులో యూటీఎఫ్ కేడర్ పాల్గొనాలని కోరారు. కనీసం మండల స్థాయిలో 10 మంది పిల్లలను, జిల్లా స్థాయిలో 20 మంది పిల్లలను చేర్పించిన వారికి అభినందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు ఎస్.ప్రభాకర్, రొంగలి ఉమాదేవి, కోశాధికారి కె.రాంబాబు, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి టి.అప్పారావు, జిల్లా కార్యదర్శులు చుక్క సత్యం, రిజ్వాన్, రియాజ్, సీనియర్ నాయకులు బి.జనార్ధన్‌తో పాటు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

లాడ్జిలో వ్యక్తి అనుమానాస్పద మృతి


లాడ్జిలో మంచంపై విగతజీవిగా లోకనాథ్

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ లాడ్జిలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. స్నేహితులతో కలిసి కొంత సమయం గడిపిన తర్వాత అతను మరణించినట్లు తెలుస్తోంది. ఎస్ఐ రాందాస్ తెలిపిన వివరాలివి.. కాకినాడకు చెందిన కుక్కల లోకనాథ్(34) ఎంవీపీ కాలనీలోని సోషల్ వెల్ఫేర్ ఆఫీసులో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం చేస్తున్నాడు. అతని భార్య కూడా సోషల్ వెల్ఫేర్ ఆఫీసులో కాంట్రాక్టు పద్ధతిలో అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేటలో ఉద్యోగం చేస్తోంది. అతని అత్తగారిల్లు నగరంలోని దసపల్లా ప్రాంతంలో ఉంది. వారాంతంలో వారు నగరంలోని అత్తవారింటికి వస్తుంటారు. సోషల్ వెల్ఫేర్ విభాగంలో జరుగుతున్న బదిలీలకు సంబంధించి లోకనాథ్ మరో నలుగురు స్నేహితులతో కలిసి శనివారం నగరానికి వచ్చాడు. హనుమంతవాక వద్ద పారామౌంట్ లాడ్జిలో వారంతా రూమ్ తీసుకున్నారు. ఆదివారం అందరూ కలిసి డ్యూటీకి వెళ్లాల్సి ఉండగా.. లోకనాథ్ 'ఒంట్లో బాలేదు.. కొంతసేపు ఉండి వస్తాను'అని మిగిలిన స్నేహితులకు చెప్పాడు. దీంతో మిగిలిన నలుగురు స్నేహితులు లాడ్జి నుంచి బయలుదేరి డ్యూటీకి వెళ్లిపోయారు. కొంతసేపటికి లోకనాథ్ రూమ్ నుంచి బయటకు వచ్చి 'కడుపులో మంటగా ఉంది'అని ఓ షాపులో గ్యాస్ట్రిక్‌కు సంబంధించిన ప్యాకెట్ కొన్నాడు. తిరిగి రూమ్‌కి వెళ్లిపోయాడు. 'కడుపు నొప్పిగా ఉంది. కొంత సేపటి తర్వాత వస్తాను' అని ఆఫీసు హెడ్‌కు ఫోన్‌లో చెప్పాడు. ఎంతసేపటికీ లోకనాథ్ డ్యూటీకి రాకపోవడంతో తోటి ఉద్యోగులు మళ్లీ ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో లాడ్జి నిర్వాహకులకు ఫోన్ చేసి చెప్పగా.. స్పందించిన సిబ్బంది రూమ్ తలుపులు తెరిచి చూసేసరికి మంచంపై విగతజీవిగా పడి ఉన్నాడు. లాడ్జి నిర్వాహకులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ రాందాస్, సిబ్బంది అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమిలో 'వైన్ షాపు వార్'


మారికవలసలో వైన్ షాపు వద్దంటూ ధర్నా చేస్తున్న మహిళలు

మధురవాడ: కూటమిలోని అంతర్గత లుకలుకలు బయటపడుతున్నాయి. జీవీఎంసీ 5వ వార్డు, మారికవలస జంక్షన్, శారదానగర్ వద్ద వైన్ షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా మహిళలు రోడ్డెక్కారు. దీనికి జనసేన, సీపీఎం నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా జనసేన 5వ వార్డు అధ్యక్షుడు దేవర శివ మాట్లాడుతూ మారికవలస జంక్షన్ సర్వీస్ రోడ్డులో ఇప్పటికే ఒక వైన్ షాపు నివాసాలను ఆనుకొని ఉందని, ఇప్పుడు నివాసాల మధ్య, దానికి అత్యంత దగ్గరలో మరో దుకాణం ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఉన్న ఒక్క షాపుతోనే అనేక ఇబ్బందులు పడుతుంటే, రెండో షాపు ఏర్పాటుతో అవస్థలు రెట్టింపు అవుతాయని చెప్పారు. దీనిని ఆపకపోతే ఎటువంటి పోరాటానికైనా తాము సిద్ధంగా ఉంటామని శివ స్పష్టం చేశారు. సీపీఎం నాయకురాలు భారతి మాట్లాడుతూ ఉన్న షాపు వల్లనే ఇక్కడ మహిళలు తిరగలేకపోతున్నారన్నారు. తమకు మద్యం వద్దు, మంచి నీళ్లు కావాలని నినాదాలు చేశారు. అధికారులు తక్షణమే స్పందించి మద్యం షాపు ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. ఇక్కడ రెండో వైన్ షాపు ఏర్పాటు చేస్తున్న షెడ్ టీడీపీ మాజీ కార్పొరేటర్‌కు చెందినది కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పైగా ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా జనసేన నాయకుడు రోడ్డెక్కి ధర్నాకు దిగడం గమనార్హం.

సీనియర్ జర్నలిస్ట్ దివాకర్ మృతికి సంతాపం


పైల దివాకర్ (ఫైల్)

మహారాణిపేట: సీనియర్ జర్నలిస్టు పైల దివాకర్ కన్నుమూశారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో గాయత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దివాకర్ పార్థివ దేహాన్ని అక్కయ్యపాలెంలోని ఆయన నివాసంలో సందర్శనార్థం ఉంచారు. సోమవారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా పని చేసిన దివాకర్.. వైజాగ్ జర్నలిస్టు ఫోరం కార్యవర్గ సభ్యుడిగానూ సేవలందించారు. 2010 నుంచి వైఎస్సార్ సీపీ పీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన మృతి తీరని లోటని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

హార్బర్‌లో చేపల జాతర





మహారాణిపేట: విశాఖ సాగర తీరంలో వేట మళ్లీ ఊపందుకుంది. 61 రోజుల వేట నిషేధాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని సముద్రంలోకి అడుగుపెట్టిన మత్స్యకారుల వలలకు ఇప్పుడు సిరుల పంట పడుతోంది. భారీ ఎత్తున పట్టుబడిన మత్స్య సంపదతో ఆదివారం విశాఖ ఫిషింగ్ హార్బర్ కోలాహలంగా మారింది. ఈ సీజన్ ఆరంభం మత్స్యకారులకు శుభసూచకంగా మారింది. ముఖ్యంగా రొయ్యలు భారీ పరిమాణంలో లభించడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాణ్యమైన రొయ్యలతో పాటు పీతలు, వంజరాలు, ట్యూనా, చందువాలు, మెత్తని పారలు వంటి రకరకాల చేపలు కూడా పుష్కలంగా దొరికాయి. వేట నిషేధం సత్ఫలితాలనిచ్చిందని, సముద్రంలో మత్స్య సంపద పెరిగిందని మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కావడంతో ఫిషింగ్ హార్బర్ కొనుగోలుదారులు, వ్యాపారులతో కిటకిటలాడింది. పడవలు ఒడ్డుకు చేరగా.. తాజా చేపల కోసం జనం ఎగబడ్డారు. ఈ చేపలను స్థానిక మార్కెట్లలో విక్రయించడంతో పాటు, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు మత్స్యకారులు ఏర్పాట్లు చేశారు.

కిటకిటలాడిన హార్బర్


సాగరతీరం.. సరదాల హోరం

సాగరతీరం ఆదివారం కిటకిటలాడింది. నగరవాసులు, పర్యాటకులు ఆర్.కె.బీచ్, రుషికొండ, సాగర్‌నగర్, భీమిలి తీరాలకు పోటెత్తారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చిన ప్రజలు సముద్ర స్నానాలు చేస్తూ, ఇసుక తెన్నెలపై ఆడుకుంటూ ఉత్సాహంగా గడిపారు. సముద్రం వెనక్కి వెళ్లడంతో తేలిన రాళ్లపై సెల్ఫీలు దిగారు. మురి మిక్చర్, మొక్కజొన్న పొత్తుల బండ్ల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

రాళ్లపై సందర్శకుల సందడి




